# వెండి పొడుం డబ్బీ

జోరాఖాట్‌లో క్యాంపు ఏశాం. గ్రవుండంతా అయింది. రసాన్‌ కొయ్యా ఎంటనే యేశాడు ఖజానా గార్డు డూటీ.

తొమ్మిదిమందిం పోయాం. రాత్రంతా డూటీయే. తెల్లవారుఝామున అళ్ళిచ్చిన చా చాల్లా-సైనా వోటలోటుంటే జొరపడ్డాం. సలేసు కొత్తోంది.

ఎట్టా యేసుకొత్తోందంటే, తలంటోసు కుంటుంటే సెవుల్లో నూనేసు కుంటున్నప్పుడు కళ్ళల్లో గుంయి మంటుందే — ఆ రకంగా గుంయి మంటోంది, వాళ్ళంతా!

చా తాగుతూండేప్పుడు, ఇంకా లైట్లున్నాయి. బోడి రాముడుగాడు సేతిలో వో వెండి పౌడుండబ్బా పట్టుకుని దాని మీద మన్ను రుద్దేస్తూ "నాకిది, నిన్న పెరేడ్ గ్రవుండు ప్రక్కన దొరికిందిరా" అన్నాడు.

"యేందిరా యేందిరా?" అంటూ నలుగురం సుట్టూ మూగేం.

నిజంగా యెండే! పై మన్ను తుడిసేత్తుంటే మతాబల్లే ఎలిగిపోతోంది.

వో సిపాయన్నాడు, "నిజంగా యెండేరా రాముడూ?"

"నిజంగానా! సచ్చినట్టు నిజంగా!" అన్నాడు రాముడు.

"పావలా ఇత్తారా నా కియ్యరా!" అన్నాడు అబ్బాయిగారి సుబ్బాయి.

"తీసుకోరా ఆడి పావలా, పోతే రాదురా" అన్నాడు గన్నరు గురవాయి.

"దాన్ని తిప్పి సూడ్రా! టైం సెప్పురా!" అన్నాను నేను.

"దాన్ని తిప్పితే నీ గుండెలో కొట్టుకున్నట్టు లబ్డీకె లబ్డీకె అని కొట్టుకున్నట్టుందిరా!" అన్నాడు అబ్బాయిగారి సుబ్బాయి.

చా తాగుతున్నా నేను. ఆడిమాటలికి కొరబోయింది.

"అది అచ్చం యెండికాదురా" అన్నాడు ఇంకో సిపాయి.

ఆడ్ని ఓ సూపు సూశాడు బోడి రాముడు! ఆడనుకోడం సివుడల్లే సూశానని! కాని నేననుకోడం యీగను పట్టబోయే బల్లల్లే సూశాడు.

అడింకో బిల్లకుపోయి ఇంకో సిపాయితో 'పాలో పంచదార తక్కువైందిరా' అని యేమీ తెలీనాడల్లే కూకున్నాడు.

"యెండయినా సరే, కాకపోయినా సరేరా. ఆఖరిమాట అర్థరూపా యిత్తారా!" అన్నాడు అబ్బాయిగారి సుబ్బాయి.

"అర్ధలేదు గిర్ధలేదు, రూపాయి సెయ్యరా రాముడూ! గంతేసి తీసు కుంటాడు" అన్నాడు గన్నరు గురవాయి.

"సరే, నలుగురూ సెప్పినమాట ఇనాల్రా.ఆల్‌రైట్, రూపాయిత్తారా లాభమో నట్టమో! పరవాలేదు, అన్నమాట తప్పను" అన్నా డబ్బాయిగారి సుబ్బాయి.

"బలేహాన్సురా! అసలది యెండో కాదోరా ఇచ్చేయరా!" అన్నాను నేను.

దురదగా ఉన్నోడు సొంతంగానే గోక్కుంటాడు. దురదలేని దున్న పోతు కెవరేం సేయగలరూ!

ఇంతలో యారో కొత్తోడు హోటలులో కొచ్చాడు. ఆడి మాటలు సూత్తే, కాత్తో కూత్తో సదువుకున్నోడల్లే వున్నాడు. మేం సెప్పుకునే మాటలు యిన్నాడు. బోడి రాముడి వొంక దీర్గంగా సూశాడు. మిలిటరీ సి. ఐ. డి. గాడు గంద కొంపతీసి?

మేం మెల్లి మెల్లంగా జారాం. తలా వో బల్ల దగ్గర కూకున్నాం. కొత్తోడు సూత్తే యాళ్ళ కొకాళ్ళ కొకళ్ళకు సంబంధం లేదనిపించాలి. మా కళ్ళిప్పుడే నిద్రలేచినోళ్ళల్లే పెట్టాం.

బోడిరాముడు మాత్రం యేం మాటడలా. పెంపుడు పావురాన్ని దువ్వుతున్నోడల్లే ఓ సేతో, ఆ యెండి డబ్బీ దువ్వుతూ తాగుతుండాడు.

ఆ కొత్తోడు రాముడ్ని సూసి "ఆ పొడుం డబ్బీ ఇయ్యి సూత్తా!" నన్నాడు. దాన్ని సేత పుచ్చుకొని అటూ యిటూ సూశాడు. లోపల సూశాడు.

"నాకు పొడుమలవాటు. యీ యదవ వూళ్ళల్లో ఇటువంటి డబ్బీలు దొరకవు. అత దెంతి త్తా నన్నాడు? రూపాయా? నేను రెండు రూపాయి లి త్తా!" నన్నాడా కొత్తోడు.

మే మంతా మల్లీ గుమికూడాం. "ఇయ్యరా ఇయ్యరా!" అన్నాం.

"అంతకన్న స త్తే ఎక్కువ రాదురా" అన్నాడు గన్నరు గురవాయి.

"ఇ త్తాడు మిష్టర్, మీ డబ్బుతీ మిష్టర్" అన్నాను నేను.

ఆ కొత్తోడు రెండు రూపాయలుతీసి బల్ల మీద పెట్టాడు.

బోడిరాముడు గడియారం జేబులో పెట్టుకుని "యమదర్మరా జొచ్చినా నే నియ్యనుపోండి" అన్నాడు. ఆ కోత్తోడు డబ్బు పుచ్చుకుని అదేపోత పోయాడు.

"అదేందిరా! మంచి బేరం పోగొట్టావు. ఆ బేరం సిసలయితే మాకు చా ఇప్పిత్తా వనుకున్నాం! నీ మొగం నువ్వేం చేసుకుంటావురా?" అన్నాం అంతా కలిసి పెండ్లి లో మేళాలల్లే.

"ఏడిశారు లేండర్రా. నే నిదెవ్వరి కివ్వను. నా భార్యకు నే నింత వరకు సొమ్మే పెట్టలా. ఆయిడ పొడుం పీలుత్తుంది. ఇదాయిడకు పంపిత్తా. నే నింటి కెళ్ళేటప్పటి కాయిడ మొగమెట్టా వుంటుందో సూడాలి!" అన్నాడు రాముడు.

"పొడుం బుర్రల్లే వుంటుందిరా!" అన్నాడు గన్నరు గురవాయి.